సాక్షి ఎన్టీఆర్ జిల్లా

బుధవారం । 13 । డిసెంబర్ । 2023



పోస్టర్ ఆవిష్కరణ

అజిత్‌సింగ్‌నగర్: వైఎస్సార్ సీపీ విభిన్న ప్రతిభావంతుల విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవ ఆహ్వాన పత్రికను మంగళవారం ఎమ్మెల్సీ రుహుల్లా ఆవిష్కరించారు.



మాక్‌పోలింగ్ కేంద్రం ప్రారంభం

మచిలీపట్నం: కలెక్టరేట్‌లో మంగళవారం మాక్ పోలింగ్‌కేంద్రాన్ని కృష్ణా కలెక్టర్ రాజాబాబు ప్రారంభించారు. ఓటరును చైతన్య పరచడానికి దీన్ని ఏర్పాటుచేశారు.



దుర్గమ్మ సేవలో..

ఇంద్రకీలాద్రి: బెజవాడ దుర్గమ్మను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు మంగళవారం దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు.

న్యూస్‌రీల్

జీవనశైలి వ్యాధుల నివారణకు కృషిచేయండి



లబ్బీపేట(విజయవాడతూర్పు): జీవనశైలి వ్యాధులను సరైన విధానాలు పాటించడం ద్వారా నియంత్రణలో ఉంచొచ్చని ఎన్టీఆర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని అన్నారు. జిల్లాలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులతో జాతీయ సాంక్రమిక, అసాంక్రమిక వ్యాధుల నివారణ కార్యక్రమంలో భాగంగా ఎంఓఏపీ యాప్‌పై మంగళవారం శిక్షణ సదస్సు నిర్వహించారు. అజిత్‌సింగ్‌నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ఈ సదస్సులో డాక్టర్ మాచర్ల సుహాసిని మాట్లాడుతూ.. రక్తపోటు, మధుమేహం వ్యాధుల నివారణ, ప్రొటోకాల్, చికిత్సలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రాష్ట్ర నోడల్ అధికారి డాక్టర్ రాఘవేంద్ర మాట్లాడుతూ.. జీవనశైలి వ్యాధుల నివారణ, నియంత్రణకు సరైన పద్ధతులను పాటించాలని సూచించారు. ఆరోగ్య కార్యకర్తలు ప్రజలకు ఆయా వ్యాధుల వ్యాప్తిపై అవగాహన కలిగించాలన్నారు. వైద్యులు తమ వద్దకు వచ్చే మధుమేహం, రక్తపోటు బాధితులకు ఆయా వ్యాధులను అదుపులో ఉంచుకోవడంపై అవగాహన కలిగించాలన్నారు. ఎన్సీసీ-సీడీ కార్యక్రమం అధికారి డాక్టర్ వి.మాధవి, డీపీఎంఓ నవీన్, ఏపిడిమియాలజిస్ట్ డాక్టర్ సమీర, డీపీఓ మహేష్ పాల్గొన్నారు.

15న రైల్వే పెన్షన్ అదాలత్

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): రైల్వే పెన్షనర్లు, ఫ్యామిలీ పెన్షన్‌దారుల ఫిర్యాదుల సత్వర పరిష్కారం కోసం భారతీయ రైల్వే ఈ నెల 15వ తేదీన దేశవ్యాప్తంగా అన్ని డివిజన్లలో పెన్షన్ అదాలత్‌లు నిర్వహించనుంది. అందులో భాగంగా విజయవాడ రైల్వే ఆడిటోరియంలో ఆ రోజు పెన్షన్ అదాలత్ జరుగుతుందని డివిజన్ సీనియర్ డీపీఓ బాలమురళీధర్ మంగళవారం తెలిపారు. ఆ రోజు ఉదయం ఎనిమిది గంటల నుంచి జరిగే ఈ కార్యక్రమంలో డీఆర్‌ఎం నరేంద్ర ఏ పాటిల్, ఏడీఆర్‌ఎంలు ఎం.శ్రీకాంత్, డి.శ్రీనివాసరావుతో కలసి పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ అదాలత్‌లో రైల్వే పెన్షనర్లు, ఫ్యామిలీ పెన్షనర్లు ఎదుర్కొంటున్న గ్రాట్యుటీ, సెటిల్‌మెంట్ బకాయిలు తదితర సమస్యలను తక్షణమే పరిష్కరిస్తామని పేర్కొన్నారు. సంబంధిత పెన్షన్‌దారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆయన సూచించారు.

మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లాకు 77 పతకాలు



విజయవాడ స్పోర్ట్స్: మాస్టర్ అథ్లెటిక్స్ 42వ రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉమ్మడి కృష్ణాజిల్లాకు చెందిన క్రీడాకారులు పలు విభాగాల్లో 77 పతకాలు సాధించారని కృష్ణా జిల్లా మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు కంది గంగాధరరావు, జి.ప్రసాదరావు తెలిపారు. తిరుపతిలోని ఎస్వీ యూనివర్సిటీలో ఇటీవల జరిగిన ఈ పోటీలకు జిల్లా నుంచి 42 మంది క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించారు. రన్నింగ్, హర్డిల్స్, హ్యామర్ త్రో, షాట్ పుట్, లాంగ్ జంప్, హై జంప్, జావెలిన్ త్రో, స్విమ్మింగ్ తదితర పోటీల్లో 36 బంగారు, 23 వెండి, 18 కాంస్య పతకాలను కృష్ణాజిల్లాకు అందించారని వివరించారు. ఈ పోటీల్లో అత్యుత్తమ క్రీడా నైపుణ్యం ప్రదర్శించిన క్రీడాకారులను వారు అభినందించారు.

యార్డుకు 55,391 బస్తాల మిర్చి రాక



కొరిటిపాడు(గుంటూరు): మార్కెట్ యార్డుకు మంగళవారం 55,391 మిర్చి బస్తాలు వచ్చాయి. నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానంలో 52,996 బస్తాలు విక్రయించారు. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల క్వింటా సగటు ధర రూ.8 వేల నుంచి రూ.23 వేలు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్‌లకు రూ.8 వేల నుంచి రూ.24,500 వరకు ధర లభించింది. ఏసీ కామన్ రకం ధర రూ.13 వేల నుంచి రూ.21,500 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.10 వేల నుంచి రూ.24 వేల వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5 వేల నుంచి రూ.13 వేల వరకు ధర పలికింది. విక్రయాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 19,811 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.





కార్తికం.. దేదీప్యం

కార్తిక మాసాన్ని పురస్కరించుకుని భక్తులు వేకువ జామునే పుణ్యస్నానాలు ఆచరిస్తున్నారు. కాలువలు, నదీపాయల వద్ద ప్రత్యేక పూజలు చేసి, స్నానాలు ఆచరించి నీటిలో దీపాలను వదులుతున్నారు. విజయవాడ దుర్గా ఘాట్ వద్ద మంగళవారం తెల్లవారు జామున పలువురు భక్తులు స్నానాలు ఆచరించి, కృష్ణమ్మకు దీపాలు సమర్పించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

పశ్చిమాన గందరగోళం

- విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో ఎమ్మెల్యే టికెట్‌పై పేచీ
- ఎవరికి వారు సీటు తమదేనంటున్న టీడీపీ నాయకులు
- పోటీ చేసేది తామేనంటున్న జనసేన నాయకులు
- అయోమయంలో తెలుగుదేశం, జనసేన శ్రేణులు



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): తెలుగుదేశం, జనసేన పార్టీల మధ్య సీట్ల పొత్తు ఖరారు కాలేదు. అయితే ఈ రెండు పార్టీ శ్రేణుల మధ్య విజయవాడ పశ్చిమ నియోజకవర్గ సీటు విషయమై రభస జరుగుతోంది. ఆ సీటు తమదేనంటూ టీడీపీలో నలుగురు నాయకులు బహిరంగంగా ప్రకటనలు చేస్తూ పార్టీలో గందరగోళం సృష్టిస్తున్నారు. మరోవైపు పశ్చిమ సీటు తమదేనంటూ జనసేన పార్టీ నాయకులు కూడా ప్రకటనలు ఇస్తూ మరింత రచ్చచేస్తున్నారు. దీంతో రెండు పార్టీల కార్యకర్తలు అయోమయానికి గురవుతున్నారు.

పెరుగుతున్న దూరం

రాష్ట్రంలో తెలుగుదేశం, జనసేన పార్టీలు కలిసి ఎన్నికల్లో పోటీ చేయాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో పశ్చిమ నియోజకవర్గ సీటు జనసేనకు కేటాయిస్తారన్న సమాచారం ప్రచారంలో ఉంది. అయితే కొన్ని రోజులుగా తెలుగుదేశం పార్టీ నేతలు సీటు విషయంలో ఎవరికి వారు తమదేనంటూ బహిరంగ వేదికలపై పోటీపడి ప్రకటనలు గుప్పిస్తున్నారు. ఈ వ్యవహారం ఆ రెండు పార్టీల నేతల మధ్య దూరం పెంచుతోందని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. పొత్తు సన్నాహాలు పూర్తి స్థాయిలో ప్రారంభంకాక ముందే ఈ విధమైన గలాటాలు ఆ పార్టీ శ్రేణులను గందరగోళానికి గురిచేస్తున్నాయి.

ఇరు పార్టీల్లోనూ అయోమయం

తెలుగుదేశం, జనసేన పార్టీల రెండిటిల్లోనూ గందరగోళం నెలకొంది. ఆ పార్టీ మాజీ ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ బహిరంగంగా సీట్లు తమవేనంటూ ప్రకటించి హడావుడి చేయటం, జనసేన ప్రచారం చేపట్టడంతో రెండు పార్టీల్లోనూ ఏమిటీ పరిస్థితి అంటూ కార్యకర్తలు తలలు పట్టుకుంటున్నారు. ఏది ఏమైనా పొత్తుపొడవక ముందే ఆ రెండు పార్టీల్లోనూ అయోమయ పరిస్థితులు నెలకొన్నాయి.

జనసేనకు ఝలక్

జనసేన పార్టీకి చెందిన ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పోతిన మహేష్ పశ్చిమ నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని భావిస్తున్నారు. 2019 ఎన్నికల్లోనూ పోతిన మహేష్ జనసేన అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. అయితే ఈ సారి సైతం అదే నియోజకవర్గం నుంచి పోటీ చేసి గెలుపొందాలని భావిస్తున్నారు. అందులో భాగంగా టీడీపీ జనసేన పొత్తులో సీటు తమకే కేటాయిస్తారంటూ ప్రకటిస్తూ ఆయన ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. తెలుగుదేశం పార్టీ నాయకులు తీరు చూస్తుంటే జనసేనకు పశ్చిమంలో ఝలక్ ఇవ్వటం ఖాయమని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

టీడీపీలో నాలుగు స్తంభాలాట

పశ్చిమ తెలుగుదేశం పార్టీలో నాలుగు స్తంభాలాట కొనసాగుతోంది. ఆ పార్టీ నేతలు ఎవరికి వారు సీటు తమదేనంటూ బహిరంగ సభల్లోనే ప్రకటించి అలజడి సృష్టి చేస్తున్నారు. రెండు మాసాల క్రితం ఆ పార్టీ నేత ఎంఎస్ బేగ్ పుట్టిన రోజు వేడుకలు స్థానిక పంజా సెంటర్‌లో జరిగాయి. ఆ క్రమంలో ఆ సభకు హాజరైన ఎంపీ కేశినేని నాని పశ్చిమ నియోజకవర్గం టీడీపీ అభ్యర్థిగా ఎంఎస్ బేగ్ పోటీ చేస్తాడని, అతడిని ఎమ్మెల్యేగా గెలిపించి తీరుతానని సంచలన వ్యాఖ్యలు చేసి ఆ పార్టీలో అలజడి లేపారు. ఇక మాజీ ఎమ్మెల్యే జలీల్‌ఖాన్ రెండు రోజుల క్రితం తన పుట్టిన రోజు వేడుకలను పురస్కరించుకొని మైనార్టీ ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఆ సభలో టీడీపీ పశ్చిమ సీటు తనదేనని, కేశినేని చిన్ని ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తారని జలీల్‌ఖాన్ ప్రకటించారు. ఆ మరుసటి రోజే మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న పశ్చిమ నుంచి టీడీపీ బీసీ అభ్యర్థిగా తాను పోటీ చేస్తానని, ఒక వేళ మైనార్టీకి సీటు కేటాయిస్తే నాగుల్‌మీరా బరిలో ఉంటారని ప్రకటించారు. జలీల్‌ఖాన్ వ్యవహారంపై తాను స్పందించనని మీడియా అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చారు. వీరితో పాటుగా మరి కొంత మంది సైతం టీడీపీ సీటు తమదేనంటూ హడావుడి చేస్తున్నారు.

విభిన్న సంస్కృతుల మేళవింపే భారతీయం

డైరెక్టర్ జనరల్ మినిస్ట్రీ ఆఫ్ టూరిజం మనీషా సక్సేనా

భవానీపురం(విజయవాడపశ్చిమ): దేశంలోని వివిధ రాష్ట్రాల విభిన్న సంస్కృతులు, సంప్రదాయాల మేళవింపే భారతీయం అని డైరెక్టర్ జనరల్ మినిస్ట్రీ ఆఫ్ టూరిజం మనీషా సక్సేనా అన్నారు. కేంద్ర ప్రభుత్వ టూరిజం, సాంస్కృతిక వ్యవహారాల శాఖ, టెక్స్‌టైల్ శాఖ, కేంద్ర సంగీత నాటక అకాడమీ, ఏపీ టూరిజం ఆధ్వర్యంలో 'కృష్ణవేణి సంగీత నీరాజనం' పేరుతో మూడు రోజులుగా నిర్వహించిన వేడుకలు మంగళవారం ముగిశాయి. విజయవాడ భవానీపురం హరిత బరంపార్క్‌లోని పున్నమిఘాట్‌లో ఏర్పాటు చేసిన స్టాళ్లను ఆమె సందర్శించారు. కొండపల్లి బొమ్మలు, వివిధ రాష్ట్రాల నుంచి వచ్చి ప్రదర్శించిన చేనేత, కలంకారీ వస్త్రాలు, ఎంబ్రాయిడరీ హ్యాండ్ బ్యాగ్స్, వీవర్స్ సర్వీస్ సెంటర్ (విజయవాడ) ఏర్పాటు చేసిన చేనేత మగ్గం, తిరుపతి నుంచి వచ్చిన హోటల్ మేనేజ్‌మెంట్ ఇనిస్టిట్యూషన్స్ విద్యార్థులు ఏర్పాటు చేసిన వంటకాల స్టాళ్లను పరిశీలించారు. ఆయా స్టాళ్లలో అద్భుతమైన ఉత్పత్తులను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. వంటకాల స్టాల్‌లో ఆహార పదార్థాలను రుచి చూశారు. ఇరానీ ఛాయ్ టేస్ట్ చేశారు.



కొండపల్లి బొమ్మల స్టాల్‌ను ఆసక్తిగా చూస్తున్న మనీషా సక్సేనా

ఆకట్టుకున్న ఏపీ టూరిజం వర్చువల్ రియాలిటీ

ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ ఏర్పాటు చేసిన స్టాల్‌ను సందర్శించిన మనీషా సక్సేనా అక్కడి వర్చువల్ రియాలిటీ (డెస్టినేషన్ ఆఫ్ ఎక్స్‌పీరియన్స్) ఎక్విప్‌మెంట్ ద్వారా రాష్ట్రంలోని వివిధ పర్యాటక ప్రాంతాలను తిలకించి అబ్బురపడ్డారు. డిస్ట్రిక్ట్, హబ్, థీమ్ వైజ్ ముద్రించిన బ్రోచర్‌లను ఆసక్తిగా పరిశీలించారు. ఏపీ టూరిజం ప్రధాన కార్యాలయం (విజయవాడ) ఏపీటీఏ అసిస్టెంట్ డైరెక్టర్ లజ్వంతి నాయుడు పాల్గొన్నారు.

జాతీయ బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ కల్పలత రెడ్డి



మార్చ్‌ఫాస్ట్‌లో పాల్గొన్న వివిధ రాష్ట్రాల క్రీడాకారులు

విజయవాడ స్పోర్ట్స్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం విద్యతో పాటు క్రీడారంగానికీ అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని టీచర్స్ ఎమ్మెల్సీ టి.కల్పలత రెడ్డి అన్నారు. అండర్-19 ఎస్‌జీఎఫ్ 67వ జాతీయ బ్యాడ్మింటన్ బాలబాలికల పోటీల ప్రారంభోత్సవం విజయవాడలోని పీబీ సిద్ధార్థ ఆర్ట్స్,సైన్స్ కాలేజీ ప్రాంగణంలో మంగళవారం జరిగింది. పాఠశాల విద్య కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్‌తో కలిసి ఆమె ఈ పోటీలను ప్రారంభించి ప్రసంగించారు. విద్యారంగ సంస్కరణలు అమలు చేయడంతో పాటు క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 15 నుంచి 'ఆడుదాం.. ఆంధ్రా' క్రీడోత్సవాలను నిర్వహించనుందని తెలిపారు. బ్యాడ్మింటన్ జాతీయ టోర్నీకి విజయవాడ వేదిక కావడం ఆనందంగా ఉందన్నారు. రాష్ట్ర పాఠశాల విద్య కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్ మాట్లాడుతూ.. తెలుగు నేలపై నుంచి పుల్లెల గోపీచంద్, సైనా నెహ్వాల్, పి.వి.సింధు భారతీయ క్రీడా ప్రతిభను ప్రపంచానికి చాటారని గుర్తు చేశారు.


మూడు జాతీయ టోర్నీల నిర్వహణకు అవకాశం

ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి జి.భానుమూర్తిరాజు మాట్లాడుతూ.. భారతీయ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆంధ్రప్రదేశ్‌కు మూడు జాతీయస్థాయి టోర్నీల నిర్వహణకు అవకాశం ఇచ్చిందన్నారు. ప్రస్తుత అండర్-19 బ్యాడ్మింటన్ టోర్నీతోపాటు త్వరలో కాకినాడలో అండర్-19 టెన్నిస్, రాజంపేటలో అండర్-14 బాలికల కబడ్డీ టోర్నీలు జరుగుతాయని వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అత్యంత ప్రాధాన్యమిస్తోందని, అవసరమైన నిధులను మంజూరు చేస్తోందన్నారు. 44,998 పాఠశాలలకు స్పోర్ట్స్ కిట్లను ప్రభుత్వం పంపిణీ చేసిందని గుర్తు చేశారు. అండర్-19 బ్యాడ్మింటన్ బాలబాలికల టోర్నీ ఈ నెల 16 వరకు పటమట సీహెచ్‌ఆర్‌కే ఇండోర్ స్టేడియంలో జరుగుతుందన్నారు. 33 రాష్ట్రాల నుంచి 325 మంది క్రీడాకారులు ఈ టోర్నీకి ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు తెలిపారు. తొలుత ఎమ్మెల్సీ కల్పలత రెడ్డి, కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడా ఉత్సవాలను లాంఛనంగా ప్రారంభించారు. ఎస్‌జీఎఫ్ఐ, ఎస్‌జీఎఫ్ ఏపీ, కళాశాల పతాకాలను ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి, జాతీయ పతాకాన్ని కమిషనర్ సురేష్‌కుమార్ ఆవిష్కరించారు. టోర్నీ జాతీయ అబ్జర్వర్ రాజు రాణా, కన్వీనర్ సి.శివసత్యనారాయణరెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ వి.రవికాంత, ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సహాయ కార్యదర్శి కె.వి.రాధాకృష్ణ, పీబీ సిద్ధార్థ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. అనంతరం పటమటలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో టీం చాంపియన్‌షిప్ లీగ్ మ్యాచ్‌లు హోరాహోరీగా జరిగాయి.

లావైపోతున్నారు!

జీవనశైలే ప్రధాన శత్రువు

- శరీర బరువు అదుపులో ఉంటేనే ఆరోగ్యం
- అధిక కొలెస్ట్రాల్‌తో రక్తనాళాలు పూడి ఆకస్మిక మరణాలు
- ఒత్తిడికి లోనై దెబ్బతింటున్న కిడ్నీల ఫిల్టర్లు
- బ్రెయిన్ స్ట్రోక్‌కు కారణమవుతున్న స్థూలకాయం
- వ్యాయామం, ఆహార నియమాలు తప్పనిసరి అంటున్న వైద్యులు




లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రస్తుత కంప్యూటర్ యుగంలో ప్రజల జీవనంలో పెనుమార్పులు చోటుచేసుకున్నాయి. కదలికలేని జీవన విధానం, ఆహారపు అలవాట్లు కారణంగా చిన్నప్పటి నుంచే ఊబకాయులుగా మారుతున్నారు. వెరసి మూడు పదుల వయస్సులోనే జబ్బుల బారిన పడుతున్నారు. విజయవాడలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు వస్తున్న రోగుల్లో ఊబకాయం, శారీరక శ్రమ లేక పోవడం వల్ల జబ్బుల బారిన పడుతున్న వారే అధికంగా ఉంటున్నట్లు వైద్యులు చెబుతున్నారు. నాలుగు అడుగులు నడిచే వారు కరువయ్యారని, ఇంటి నుంచి కాలు బయట పెడితే కారు, బైక్ ఎక్కేస్తున్నట్లు వివరిస్తున్నారు. దీంతో శరీరంలో కొలెస్ట్రాల్ పెరిగి, రక్తనాళాల్లో పూడికలు ఏర్పడి ఇటీవల ఎక్కువగా ఆకస్మిక మరణాలకు దారితీస్తున్నట్లు వైద్యులు సూచిస్తున్నారు. ఒబెసిటీ కారణంగా గుండె జబ్బులు, బ్రెయిన్ స్ట్రోక్, కిడ్నీ సమస్యలు, కీళ్ల సమస్యలు, మధుమేహం, రక్తపోటు, మానసిక సమస్యలు తలెత్తుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు.

గుండె జబ్బుల ముప్పు..

ఒబెసిటీతో బాధపడుతున్న వారిలో గుండె జబ్బుల ముప్పు అధికంగా ఉన్నట్లు వైద్యులు చెబుతున్నారు. విజయవాడ ప్రభుత్వాస్పత్రి కార్డియాలజీ విభాగానికి వచ్చే రోగుల్లో 25 శాతం మంది ఊబకాయులే ఉంటున్నారు. అంతేకాదు చిన్న వయస్సులోనే గుండె జబ్బుల బారిన పడే వారు కూడా వారే ఉంటున్నారు. ఊబకాయుల్లో రక్తనాళాలు సన్నబడి బ్లాక్స్ ఏర్పడటం, గుండెపై తీవ్రమైన ప్రభావం చూపుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. పల్మనరీ ఎంబోలిజమ్, పల్మనరీ హైపర్ టెన్షన్ వంటి సమస్యలను వైద్యులు గుర్తిస్తున్నారు. రక్తనాళాల్లో బ్లాక్స్ ఉన్న వారికి యాంజియోప్లాస్టీ నిర్వహించి రక్తనాళాల్లో బ్లాక్స్‌ను తొలగించి స్టెంట్‌లు వేస్తున్నారు. గుండె నరాలపై తీవ్ర ప్రభావం చూపుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు.

నియంత్రణ ఇలా..



మనదేశంలో బాడీ మాస్ ఇండెక్స్ 23.5 దాటిన వారందరినీ ఒబెసిటీగా భావిస్తారు. ఇలాంటి వారు బరువు తగ్గేందుకు శ్రమ గల జీవన విధానం, సమతుల్య ఆహారం తీసుకుంటే సత్ఫలితాలు రాబట్టవచ్చు. బరువు తగ్గేందుకు లాంగ్‌టర్మ్, షార్ట్ టర్మ్ రెండు విధానాలు ఉన్నాయి. లాంగ్‌టర్మ్‌లో వారానికి మూడు, నాలుగు గంటలు వ్యాయామం చేయడం ద్వారా బరువు తగ్గించుకోవచ్చు. షార్ట్ టర్మ్‌లో రోజుకు వెయ్యి క్యాలరీల కంటే తక్కువ ఆహారం తీసుకోవడం ద్వారా బరువు తగ్గవచ్చు. బీఎంఐ 27 శాతం కంటే ఎక్కువ ఉన్న వారికి మందులు అందుబాటులోకి వచ్చాయి. ఈ పద్ధతులు అనుసరించినా బరువు తగ్గకుంటే బీఎంఐ 30 శాతం దాటిన వారికి బేరియాట్రిక్ (మెటబాలిక్) సర్జరీలతో సత్ఫలితాలు సాధిస్తున్నారు.

పొంచి ఉన్న వ్యాధుల ముప్పు..

- ఒబెసిటీ వారిలో రక్తపోటు, మధుమేహం వల్ల వచ్చే దుష్ఫలితాలు ఎక్కువ.
- ఒబెసిటీ ఉన్న వారిలో పదిహేను శాతం మందిలో గాల్‌బ్లాడర్‌లో రాళ్లు ఏర్పడుతున్నాయి.
- ఫ్యాటీ లివర్ ఏర్పడి, దీర్ఘకాలంలో తీవ్రమైన లివర్ సమస్యలు తలెత్తుతున్నాయి.
- మోకీళ్లపై ప్రభావం చూపి, నాలుగు పదుల వయస్సులోనే మోకీలు మార్పిడి శస్త్ర చికిత్సలు చేయాల్సి వస్తుంది.
- కిడ్నీలపై ఒత్తిడి కారణంగా ఫిల్టర్‌లు దెబ్బతింటాయి. యూరిన్‌లో ప్రొటీన్‌లు లీక్ అవుతుంటాయి.
- కాళ్ల వాపులు రావడం, కిడ్నీలు పూర్తిగా పాడైన వారు కూడా ఉన్నారు.
- స్థూలకాయం ఉన్న మహిళల్లో బ్రెస్ట్ క్యాన్సర్ వచ్చే అవకాశం ఎక్కువ.


గుండె రక్తనాళాల్లో పూడికలు



ఒబెసిటీ ఉన్న వారిలో కొలెస్ట్రాల్ కారణంగా గుండె రక్తనాళాలు సన్నబడి బ్లాక్స్ ఏర్పడతాయి. దీంతో ఆకస్మికంగా గుండెపోటు వచ్చే అవకాశం ఉంది. ప్రభుత్వాస్పత్రికి వచ్చే హృద్రోగుల్లో 30 శాతం మంది ఊబకాయులే ఉంటున్నారు. ఊబకాయుల్లో పల్మనరీ ఎంబోలిజమ్ కేసులు కూడా చూస్తున్నాం. ఒబెసిటీకి జీవనశైలి కారణం. వ్యాయామం, ఆహార నియమాలు పాటించడం ద్వారా ఒబెసిటీని అధిగమించవచ్చు. ఆకుకూరలు, కూరగాయలు, తాజా పళ్లు ఎక్కువగా తీసుకోవాలి. నూనె పదార్థాలు, స్వీట్లు తక్కువగా తీసుకుంటే మంచిది.

– డాక్టర్ శ్రీహరి, కార్డియాలజిస్ట్, విజయవాడ జీజీహెచ్

సమతుల్య ఆహారం మేలు



సమతుల్య ఆహారం, శ్రమగల జీవన విధానం, జీవనశైలిలో మార్పులు పాటించడం ద్వారా బరువు తగ్గించుకోవచ్చు. ఊబకాయం ఉన్న మధుమేహులు తమ బరువులో 5 శాతం తగ్గించుకోగలిగితే అతి తక్కువ మందులతో మధుమేహాన్ని నియంత్రించొచ్చు. హృద్రోగ సమస్యలను నివారించుకోవచ్చు. ఊబకాయుల్లో మధుమేహ నియంత్రణకు ఆధునిక మందులు అందుబాటులోకి వచ్చాయి. ఎస్‌జీఎల్‌టీ2 ఇన్హిబిటర్స్, జీఎల్‌పీ1 అనాలజీస్ మందులతో సుగర్ నియంత్రణలో పాటు బరువు తగ్గుతారు.

డాక్టర్ ఎం.సునీత, మధుమేహ నిపుణులు, విజయవాడ

వైఎస్సార్ సీపీ రాష్ట్ర కమిటీల్లో పలువురి నియామకం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర మహిళా విభాగంలో వివిధ హోదాల్లో ఎన్టీఆర్ జిల్లాకు చెందిన పలువురిని నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం మంగళవారం ఓ ప్రకటన విడుదల చేసింది. రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షురాలిగా బండి పుణ్యశీల, జోనల్ ఇన్‌చార్జిగా కొత్తపల్లి రజని, ప్రధాన కార్యదర్శిగా వేముల బేబీరాణి, కార్యదర్శులుగా కాట్రగడ్డ ఫర్హానా పర్వీన్ (చాందిని), యంగల ఉమ, జాయింట్ సెక్రటరీగా బొజ్జా సుజాత నియమితులయ్యారు. రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శిగా ఐతా కృష్ణకిషోర్, జాయింట్ సెక్రటరీగా తన్నీరు నాగేంద్రను నియమించారు. కృష్ణా జిల్లాకు సంబంధించి.. రాష్ట్ర యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి(జోన్-4)గా పేర్ని కృష్ణమూర్తి, కార్యదర్శులుగా వేముల కృష్ణ, అద్దేపల్లి పురుషోత్తం, జాయింట్ సెక్రటరీగా గాజుల జయగోపాల్ నియమితులయ్యారు.

31 మందికి ఉద్యోగాలు

మచిలీపట్నంటౌన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పన శాఖ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో మంగళవారం మినీ జాబ్ మేళా నిర్వహించారు. జాబ్‌మేళాకు 59 మంది హాజరయ్యారు. వివిధ సంస్థలకు చెందిన ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి 31 మందిని పలు ఉద్యోగాలకు ఎంపిక చేశారు. గోల్డ్ ప్రిన్స్ జ్యూయలరీ కంపెనీ, పేటీఎం, వీఎస్‌ఆర్ జ్యూయలరీ కంపెనీలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు. జిల్లా ఉపాధి కల్పనాధికారి డి. విక్టర్‌బాబు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్. శ్రీనివాసరావు, ఎన్సీఎస్ యంగ్ ప్రొఫెషనల్ జయరాజు, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నియామక కార్యనిర్వాహకుడు తుర్లపాటి మధు, స్కిల్ హబ్ కో-ఆర్డినేటర్ కె. దిలీప్ పర్యవేక్షించారు.

క్లుప్తంగా

దుర్గమ్మ సన్నిధిలో అమావాస్య పూజలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): కార్తిక అమావాస్యను పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామివార్లకు ఆర్జిత సేవలు చేశారు. తెల్లవారుజామున అమ్మవారి ప్రధానాలయంలో నిర్వహించిన ఖడ్గమాలార్చన, లక్ష కుంకుమార్చన, శ్రీచక్రనవార్చన, చండీహోమం, శాంతి కల్యాణంతో పాటు మల్లేశ్వరస్వామి వారికి నిర్వహించిన త్రికాల అభిషేకాలు, అర్చనలు, సహస్ర లింగార్చనలో ఉభయదాతలు విశేషంగా పాల్గొన్నారు. సాయంత్రం అమ్మవారి పంచహారతుల సేవ, మల్లేశ్వరస్వామివారి బాలాలయంలో హారతుల సేవలకు భక్తుల రద్దీ కనిపించింది.

నేటి నుంచి మహిళా పాలిటెక్నిక్ జోనల్ ఆటల పోటీలు



నందిగామ: మహిళా పాలిటెక్నిక్ కళాశాలల జోనల్ స్థాయి ఆటల పోటీలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు నందిగామ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ రమేష్‌బాబు తెలిపారు. పట్టణంలోని మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ఉమ్మడి కృష్ణాలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో విద్యార్థినులకు అంతర పాలిటెక్నిక్ జోనల్ స్థాయి ఆటల పోటీలు బుధవారం నుంచి ఈ నెల 15 వ తేదీ వరకు జరగనున్నాయి. దీనికి కళాశాల ఆవరణలో అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మహిళా పాలిటెక్నిక్ కళాశాలల్లో విద్యార్థినులు సుమారు 250 మంది పోటీలకు హాజరుకానున్నట్లు తెలిపారు. మొత్తం 21 పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులు పాల్గొంటారని పేర్కొన్నారు. విద్యార్థినులకు మూడు రోజులపాటు పరుగు పందేలు, హై జంప్, లాంగ్ జంప్, ట్రిపుల్ జంప్, డిస్కస్ త్రో, చెస్, వాలీబాల్, ఖోఖో, టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్ పోటీలు జరుగుతాయన్నారు. వీటిలో ప్రతిభ కనబరిచిన వారు రాష్ట్ర స్థాయిలో ఆడటానికి అర్హత సాధిస్తారన్నారు. పోటీలను స్థానిక ఎమ్మెల్యే మొండితోక జగన్మోహన్‌రావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్ ప్రారంభించనున్నట్లు తెలిపారు.

మానవత్వాన్ని చాటిన క్రైస్తవం

సజ్జల రామకృష్ణారెడ్డి

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ప్రేమ, త్యాగం, కరుణ వంటి అంశాలను లోకానికి చాటిన గొప్పమతం క్రైస్తవమని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. అసోసియేషన్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ క్రిస్టియన్ కౌన్సిల్(ఏఐసీసీ) ఆధ్వర్యాన సింగ్‌నగర్ మాకినేని బసవపున్నయ్య మున్సిపల్ స్టేడియంలో అంతర్జాతీయ మహా గ్రాండ్ క్రిస్మస్ సెలబ్రేషన్స్ మంగళవారం రాత్రి ఘనంగా జరిగాయి. సజ్జల మాట్లాడుతూ క్రీస్తు పుట్టిన రోజుకు గుర్తుగా నిర్వహించే క్రిస్మస్ పండుగను ప్రపంచమంతా ఐక్యంగా జరుపుకుంటుందన్నారు. క్రీస్తు పేదల జీవితాల్లో ఎలా వెలుగు నింపారో, అదేవిధంగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు సుపరిపాలనను అందిస్తున్నారన్నారు. పాలనను పేదల గడప వద్దకు తీసుకువచ్చిన ఘనత మన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని తెలిపారు. క్రీస్తు దీవెనలు, మీ అందరి ప్రార్థనలతో రానున్న రోజుల్లో సీఎం జగనన్న మరింత మెరుగైన పాలన అందించేలా ఆశీర్వదించాలని కోరారు. 2024వ సంవత్సరం మీ జీవితాల్లో మరిన్ని వెలుగులు నింపాలని, అందరికీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తరఫు నుంచి క్రిస్మస్ శుభాకాంక్షలను తెలిపారు. మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ ఐదేళ్ల క్రితం ప్రతి గళం మన రాష్ట్రానికి మంచి ప్రభుత్వం రావాలని ప్రార్థించడంతో వైఎస్సార్ సీపీ గొప్ప మెజార్టీతో అధికారంలోకి వచ్చిందని చెప్పారు. ఆ ఏసయ్య మనకు అందించిన మంచి వరమే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని తెలిపారు. అనంతరం క్రైస్తవ మత పెద్దలతో క్రిస్మస్ కేక్ కట్ చేశారు. దైవ సేవకులు పాస్టర్ ప్రవీణ్ క్రిస్మస్ సందేశాన్ని అందించారు. ఎమ్మెల్యేలు వెలంపల్లి శ్రీనివాస్, మల్లాది విష్ణు, ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, దేవినేని అవినాష్, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, బండి పుణ్యశీల తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న సజ్జల రామకృష్ణారెడ్డి, మంత్రి జోగి రమేష్, ఎమ్మెల్యేలు వెలంపల్లి, విష్ణు, ఎమ్మెల్సీ రుహుల్లా, మేయర్ భాగ్యలక్ష్మి తదితరులు

ముగిసిన సంగీత నీరాజనం

విజయవాడ కల్చరల్: కేంద్ర సంగీత నాటక అకాడమీ, కేంద్ర సాంస్కృతిక వ్యవహారాల శాఖ, కేంద్ర ప్రభుత్వ టూరిజం, ఏపీ టూరిజం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తుమ్మపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రం, దుర్గఘాట్‌లో నిర్వహిస్తున్న సంగీతోత్సవాలు మంగళవారం ముగిసాయి. హరికథా భాగవతారిణి ఉమామహేశ్వరి సుగ్రీవ విజయం కథను గానం చేశారు. విజయవాడకు చెందిన యువ కళాకారుల బృందం ఆదిభట్ల నారాయణ దాసు, మునిపల్లె సుబ్రహ్మణ్య కవి కృతులను మధురంగా గానం చేశారు. నారాయణదాసు కృతి శ్రీ రామ చంద్ర, కన్నవారెంత ధన్యులో కీర్తనలను ఆలపించారు. సంగీత విదుషీమణి మండా సుధారాణి బృందం సద్గురు త్యాగరాజ స్వామి రచించిన ప్రహ్లాద విజయం సంగీత రూపకం నిర్వహించారు. తమిళనాడుకు చెందిన ప్రమీలా గురుమూర్తి క్షేత్రయ్య పదాలను పాడుతూ పద సౌందర్యం అంశంగా ప్రసంగించారు. సంగీత విద్వాంసుడు పోపూరి గౌరీనాథ్, గాయత్రి గౌరీనాథ్ బృందం భక్త కవి తూము నరసింహమూర్తి కీర్తలను వినిపించారు. చెన్నైకి డాక్టర్ లలిత సంగీత కళాశాల బృందం త్యాగరాజ స్వామి రచించిన ఉత్సవ సంప్రదాయ కీర్తనలు వినిపించారు. మైసూర్ నాగమణి శ్రీనాథ్, తమిళనాడుకు చెందిన రంజనీ సంతాన గోపాలన్ సంగీత త్రిమూర్తులు త్యాగరాజ స్వామి, ముత్తు స్వామి దీక్షితార్, శ్యామశాస్త్రి కీర్తనలను వినిపించారు. హైదరాబాద్ సిస్టర్స్‌గా ప్రసిద్ధి చెందిన వేదుల షణ్ముఖ ప్రియ, వేదుల హరి ప్రియ బృందం సంప్రదాయ కీర్తనలను వినిపించారు.



పంచరత్న కీర్తనలు గానం చేస్తున్న మల్లాది సూరిబాబు బృందం

కృష్ణమ్మకు పంచరత్న కృతులతో నీరాజనం

దుర్గాఘాట్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికమీద మల్లాది సూరిబాబు, మల్లాది రాంప్రసాద్, మల్లాది శ్రీరాం పంచరత్న కృతులను గానం చేశారు. కార్యక్రమంలో డైరక్టర్ జనరల్ కేంద్ర టూరిజం శాఖ మనీషా సక్సేనా, జాయింట్ డైరెక్టర్ మినిస్టర్ ఆఫ్ కల్చరల్ ఉమా నందూరి సంగీత కళాకారులను ఆత్మీయంగా సత్కరించారు.

ఆడుదాం ఆంధ్రాకు ఏర్పాట్లు చేయండి

జిల్లా, మండలస్థాయి ప్రత్యేక అధికారులతో జేసీ సంపత్ కుమార్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈనెల 15 నుంచి ఆడుదాం ఆంధ్రా క్రీడోత్సవాలను నిర్వహించనున్న నేపథ్యంలో జిల్లా స్థాయి అధికారులు క్షేత్రస్థాయి అధికారులతో సమన్వయం చేసుకుంటూ పోటీల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఎన్టీఆర్ జిల్లా జాయింట్‌కలెక్టర్ పి.సంపత్ కుమార్ అన్నారు. ఆడుదాం ఆంధ్ర క్రీడోత్సవాల సన్నద్ధతపై సమీక్షించేందుకు జేసీ.. మంగళవారం జిల్లా, మండలస్థాయి ప్రత్యేక అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీలకు బుధవారంలోపు రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సి ఉందన్నారు. ఇంకా ఎవరైనా ఔత్సాహికులు ఉంటే వారు కూడా గ్రామ, వార్డు సచివాలయం స్థాయిలో రిజిస్ట్రేషన్ చేయించుకునేలా చూడాలన్నారు. ముఖ్యంగా మహిళలపై ప్రత్యేకంగా దృష్టిసారించాలన్నారు. గ్రామ, మండల, నియోజకవర్గం, జిల్లా, రాష్ట్రస్థాయిలో కాంపిటీటివ్ కేటగిరీలో క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో క్రీడాంశాల్లో పోటీలు జరుగుతాయన్నారు. ఇప్పటికే జిల్లాస్థాయి నుంచి మండలాలకు క్రీడా సామగ్రి చేరాయని, అక్కడి నుంచి గ్రామ సచివాలయాల స్థాయి ప్రత్యేక అధికారులకు సామగ్రిని అందజేయాలని సూచించారు. ఈ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదుచేయాలన్నారు. సమావేశంలో చీఫ్ కోచ్ ఎస్ఏ అజీజ్, మునిసిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జేసీ సంపత్‌కుమార్

వివాహిత బలవన్మరణం

నందిగామ: కార్తిక సోమవారం నేపథ్యంలో ఆలయానికి వెళదామన్న భార్యను.. భర్త తీసుకువెళ్లకపోవడంతో మనస్తాపానికి గురైన వివాహిత క్షణికావేశంలో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని మృతి చెందిన ఘటన సోమవారం రాత్రి నందిగామ పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం కృష్ణా జిల్లా ఉయ్యూరుకు చెందిన స్వర్ణ భార్గవి (21) అదే ప్రాంతంలోని తేలప్రోలుకు చెందిన విశ్వనాథ మల్లిక్ ను మూడేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకుంది. వీరు ఐదు నెలల నుంచి నందిగామలోని రైతు తోటలో నివసిస్తున్నారు. భార్గవి పట్టణంలోని ఓ షాపింగ్ మాల్‌లో పని చేస్తుంది. కార్తిక మాసం ఆఖరి సోమవారం నేపథ్యంలో ఆలయానికి వెళదామని భర్తను కోరింది. తనకు ఆరోగ్యం బాగాలేదని తీ సుకువెళ్లడానికి నిరాకరించాడు. ఈ నేపథ్యంలో ఇద్దరి మధ్య స్వల్ప వివాదం చోటు చేసుకుంది. క్షణికావేశంలో భార్గవి ఇంట్లోని ఫ్యాన్ కు ఉరి వేసుకొని మృతి చెందింది. సమాచారం తెలుసుకున్న ఏసీపీ జనార్ధన్ నాయుడు, ఇన్‌స్పెక్టర్ హనీష్ మంగళవారం ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతిపై మరింత లోతుగా విచారణ జరుగుతున్నట్లు తెలిపారు.

శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యం

ఇబ్రహీంపట్నం: ఎన్టీఆర్ జిల్లా పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు అధిక ప్రాధాన్యమిస్తున్నామని విజయవాడ డీసీపీ విశాల్ గున్నీ చెప్పారు. ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం వెస్ట్‌జోన్ ఏసీపీ హనుమంతరావుతో సందర్శించారు. స్టేషన్ రికార్డులు పరిశీలించారు. కేసుల నమోదు, పెండింగ్ కేసులు వివరాలు తెలుసుకున్నారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్ల కదలికలపై ఆరా తీశారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గంజాయి అక్రమ రవాణాపై ఆరు నెలలుగా ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. జిల్లాలో చాలా వరకు అక్రమ రవాణా అరికట్టామని చెప్పారు. ప్రతి స్టేషన్‌లో సిబ్బంది పనితీరు మెరుగుపడేలా కౌన్సిలింగ్ ఇస్తున్నట్లు తెలిపారు. సబ్ డివిజన్ పరిధి పోలీస్‌స్టేషన్లలో తనిఖీలు నిర్వహించి నివేదికను సీపీ టీకే రాణాకు వివరిస్తామన్నారు. సీఐ పి.శ్రీను పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం పీఎస్‌లో మాట్లాడుతున్న డీసీపీ విశాల్ గున్నీ, ఏసీపీ హనుమంతరావు, సీఐ శ్రీను

లారీ ఢీ.. ద్విచక్రవాహనచోదకుడి దుర్మరణం

కృష్ణలంక(విజయవాడతూర్పు): లారీ ఢీకొనడంతో ద్విచక్రవాహనచోదకుడు దుర్మరణం పాలైన ఘటన కృష్ణలంక పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు బుడమేరు మధ్యకట్టకు చెందిన దూలిపూడి వెంకట శివనారాయణ(62) ప్రైవేట్ ఉద్యోగి. మంగళవారం సాయంత్రం 4 గంటల సమయంలో అతను తన ద్విచక్ర వాహనంపై బస్టాండ్ వైపు నుంచి జాతీయ రహదారి మీదుగా బెంజిసర్కిల్ వైపు వెళ్తున్నాడు. నేతాజీ వంతెన సమీపానికి వెళ్లగానే వారధి వైపు నుంచి బెంజిసర్కిల్ వైపు అతివేగంగా వెళ్తున్న లారీ.. ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. అతను లారీ చక్రాల కింద పడి ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని వద్ద ల భించిన ఆధారాలతో కుటుంబ సభ్యులకు సమాచా రం అందించారు. లారీని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చోరీ కేసుల్లో నలుగురి అరెస్టు

పెనమలూరు: వివిధ చోరీ కేసుల్లో నలుగురు నిందితులను అరెస్టు చేశామని సీఐ టీవీవీ రామారావు తెలిపారు. ఆయన మంగళవారం వివరాలు తెలుపుతూ పెనమలూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో బైక్‌లు, దుకాణాల్లో చోరీ చేసిన వారిని అరెస్టు చేశామన్నారు. చోరీల ఘటనలపై ఎస్పీ జాషువా ఆదేశాల మేరకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఈ క్రమంలో ఎస్ఐ రమేష్ అందించిన సమాచారం మేరకు తెలప్రోలుకు చెందిన కగ్గా నరేంద్ర, ఓసూరి చిట్టికాసులు, కానూరుకు చెందిన పెరిమళ్ల రాజు, పమిడిముక్కలకు చెందిన చిన్నం భరత్‌కుమార్‌ను అరెస్టు చేశామని తెలిపారు. వారి వద్ద నాలుగు బైక్‌లు, ల్యాప్‌టాప్, రూ.16 వేలు స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. పైన పేర్కొన్న వ్యక్తులు రెండు నెలల క్రితం ఉషోదయ మార్టులో, పోరంకిలో బాంబే డయింగ్ వస్త్ర దుకాణంలో చోరీకి పాల్పడ్డారన్నారు. చిన్నం భరత్‌కుమార్ కానూరు, తాడిగడపలో రెండు బైక్‌లు చోరీ చేశాడని వివరించారు. వ్యాపారులు అప్రమత్తంగా ఉండాలని సీఐ రామారావు చెప్పారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో విషం తీసుకుని ఓ వ్యక్తి అనుమానాస్పద రీతిలో మృతి చెందిన ఘటన మంగళవారం కొత్తపేట పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఘటనపై మృతుడి భార్య ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పి.నైనవరం గ్రామానికి చెందిన గంజాల నాగమణి, మారుతీరావు దంపతులకు ఇద్దరు కుమారులు. మారుతీరావు వడ్రంగి పని చేస్తున్నాడు. వచ్చిన డబ్బులతో మద్యం తాగుతూ ఉంటాడు. మంగళవారం ఇంటి నుంచి బయటకు వెళ్లిన మారుతీరావు ఇన్నర్‌రింగ్ వద్ద రోడ్డుపై పడి ఉన్నాడంటూ.. తెలిసిన వ్యక్తి ఫోన్ చేసి చెప్పాడు. అక్కడకు వచ్చి చూసిన కుటుంబ సభ్యులు 108 సిబ్బందికి ఫోన్ చేసి సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న 108 సిబ్బంది మారుతీరావును పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మారుతీరావు ప్యాంట్ జేబులో పాయిజన్ ప్యాకెట్లను కుటుంబ సభ్యులు గుర్తించారు. ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో విషం తీసుకుని చనిపోయి ఉంటాడని భావించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

స్కానింగ్ కేంద్రాలను నమోదు చేసుకోవాలి

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలోని అన్ని స్కానింగ్ కేంద్రాలు తప్పనిసరిగా పీసీపీఎన్‌డీటీ చట్టం పరిధిలో నమోదు చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ గీతాబాయి అన్నారు. మచిలీపట్నంలోని స్కానింగ్ కేంద్రాలను మంగళవారం ఆమె పరిశీలించారు. డీఎంఅండ్‌హెచ్‌వో మాట్లాడుతూ జిల్లాలో లింగ నిర్ధారణ నిషేధ చట్టం పటిష్టంగా అమలు చేస్తారని తెలిపారు. దీన్ని ఉల్లంఘించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ధాన్యాన్ని మిల్లులకు చేర్చండి

కృష్ణా కలెక్టర్ రాజాబాబు

చిలకలపూడి(మచిలీపట్నం): రహదారులపై ఉన్న ధాన్యాన్ని వాహనాల్లో మిల్లులకు తరలించాలని కలెక్టర్ రాజాబాబు అధికారులను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ అపరాజితసింగ్‌తో కలిసి మంగళవారం జిల్లా, క్షేత్రస్థాయి అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ధాన్యం సేకరణ, ఓటర్ల జాబితా సవరణ, లంకభూముల పురోగతి తదితర అంశాలపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ రహదారులపై రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకుంటున్నారన్నారు. రెండు లేదా మూడు రోజుల తర్వాత ఆ ధాన్యాన్ని వాహనానికి ఎక్కించి ఆన్‌లైన్ ద్వారా మ్యాపింగ్ చేసి సంబంధిత మిల్లులకు తరలించాలని సూచించారు. ఆరబెట్టిన ధాన్యాన్ని తరలించడానికి వాహనాలు లేవని, ఎవరూ పట్టించుకోవడం లేదని ఆరోపణలు రాకుండా జాగ్రత్త వహించాలన్నారు. వ్యవసాయాధికారులు, వీఆర్వోలు విస్తృతంగా పర్యటించాలని చెప్పారు. రైతులతో మాట్లాడి ధైర్యం చెప్పి ప్రభుత్వం ఆదుకుంటుందని భరోసా ఇవ్వాలన్నారు. ఈ నెల 18వ తేదీకి పంట నష్టం వివరాలను సేకరించటం పూర్తి చేయాలన్నారు. ఆ వివరాలు 22వ తేదీ వరకు రైతుభరోసా కేంద్రాల్లో సామాజిక తనిఖీకి ప్రదర్శించాలని తెలిపారు. తుపాను కారణంగా మొదట్లో ఆఫ్‌లైన్‌లో వాహనాలను మిల్లులకు కేటాయించారని, ఇకపై ఆన్‌లైన్‌లో మాత్రమే మ్యాపింగ్ చేయాలని పేర్కొన్నారు.

ధ్రువీకరణ పత్రం పొందాలి

ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి ఈ నెల 9వ తేదీ వరకు స్వీకరించిన వివిధ రకాల దరఖాస్తుల వివరాలను బీఎల్వోల నుంచి ధ్రువీకరణ పత్రం వెంటనే పొందాలన్నారు. లంక భూములు ఈ-కేవైసీ చేయడంలో నాగాయలంక మండలం వెనుకబడి ఉందని పురోగతి సాధించాలని కలెక్టర్ సూచించారు. టెలీకాన్ఫరెన్స్‌లో పౌరసరఫరాల సంస్థ జిల్లా ఇన్‌చార్జ్ మేనేజర్, ఉయ్యూరు ఆర్డీవో దాసి రాజు, మచిలీపట్నం, గుడివాడ ఆర్డీవోలు పి పద్మావతి, ఎం వాణి, డీఎస్‌వో వి పార్వతి, జిల్లా వ్యవసాయాధికారి ఎన్.పద్మావతి తదితరులు పాల్గొన్నారు.